# 6. కర్షకుని భార్య

ఒకనాడు ట్రెయిల్లీస్ జమీందారుగారు నాతో ఇలా అన్నారు: "మరిన్ విల్లీలో వున్న అడవిలో ఈ సంవత్సరం వేటకు నీవు తప్పక రావాలి. నేను ఒంటరివాణ్ణి. అక్కడ వున్న ఇల్లు చాలా పురాతనమైనది. నీబోటి ప్రియమిత్రుల్ని తప్ప వేరెవ్వరినీ పిలిచేందుకు వీల్లేదు."

జమీందారుగారి ఆహ్వానాన్ని నేను స్వీకరించాను. అనుకున్న ప్రకారం శనివారం నాడు నార్మండీ వైపు వెళ్ళే రైలులో బయలుదేరి అర్విమరె స్టేషన్‌లో దిగాము. పల్లెటూళ్ళల్లో వుండే కొయ్యబండినీ, దాన్నిలాగే గుర్రాన్నీ, నడిపే ముసలివాణ్ణి జమిందారు నాకు చూపారు.

"ఇతనే మన అడివికి కాపలాదారు."

ముసలివాడు వినయంగా తలవంచి తన చేతిని జమీందారు వైపు జాపాడు. జమిందారు అతని చేతిని గౌరవభావంతో వత్తాడు.

"జీన్ ఎలా వున్నావు?"

"మామూలుగానే ఉన్నాను ప్రభూ!"

బండిలో కూర్చున్నాము. బలిష్ఠమైన గుర్రం మొదట్లో హరాం చేసి పరుగు లంకించుకుంది. ఆ బండి కుదుపులకు మేము గాలిలోకి ఎగిరెగిరి పడసాగాము. ఈ ప్రయాణాంతంలో శరీరంలోని మెట్టపల్లాలు చాలావరకు సర్దుకుంటాయనే నమ్మకం కలిగింది.

గుర్రాన్ని ఎంత దువ్వినా అది వినిపించుకునే స్థితిలోలేదు. సరిగ్గా లేని దారివెంట ఒకటే పరుగు! మేము వెంటతీసుకొని వెళ్ళిన రెండు కుక్కలూ వెనక కాళ్ళమీద లేచి నిలబడి అడివి గాలిని పీల్చసాగినవి.

జమీందారు విచారంగా దూరానికి చూడసాగాడు. వాతావరణమంతా నిశ్శబ్దంగానూ, విచారకరంగానూ వున్నట్లే తోచింది. దారికి అటూ ఇటూ రకరకాల చెట్లూ ఉన్నవి. అక్కడక్కడ వున్న ఇళ్ళు సరిగా కనిపించకుండా గున్న సీమరేగుచెట్లు అడ్డం వున్నవి. దృష్టి పోగలిగినంత దూరమూ పెద్ద పెద్ద చెట్లు వొత్తుగా పెరిగివుండటం కనిపిస్తూనే వుంది.

జమీందారు హఠాత్తుగా అన్నాడు: "ఈ భూమంటే నాకు ఎంతో ఇష్టం,. నా తాలూకు వేళ్ళు ఈ భూమిలోనే ఉన్నవనిపిస్తుంది." నార్మనుల రక్తం వున్న జమిందారు, బలిష్టంగా, పొడవుగా వుంటాడు. పురాణకాలంలో నార్మనులు ప్రతి సముద్రం ఒడ్డునా ఒక సామ్రాజ్యాన్ని స్థాపించాలనే పట్టుదలతో ఎన్నో సాహసకృత్యాలు చేశారు. వాటి తాలూకు జ్ఞాపకాలు మాత్రమే నేడీ జమీందారులో కనిపిస్తున్నాయి. జమీందారు వయస్సు యాభైదాకా వుంటుంది. బండితోలే కర్షకుని కన్న తక్కువేనని చెప్పవచ్చు. కర్షకుడు సన్నగా ఎముకలు, చర్మం మాత్రమే వున్నవాడుగా ఉన్నాడు. అయితేనేం ఇలాంటివాళ్ళే శతాబ్దం బతుకుతారు!

రెండు గంటల ప్రయాణానంతరం బండి ఒకానొక శిథిలావస్థలో వున్న ఇంటిముందు ఆగింది. ఇంటి ఆవరణలో రకరకాల ఫలవృక్షాలూ ఉన్నాయి. బండి ఆగగానే ఒక ముసలిదీ, ఒక పడుచుకుర్రాడూ వినయంతో మమ్మూ ఆహ్వానించారు.

మేము ఇంటిలోకి వెళ్ళాం. పొగల్ని కక్కుతున్న వంట యింట్లో పూర్వశతాబ్దంలోని లోహపాత్రలు మెరుస్తున్నవి. టేబిల్‌కింద ఒక పిల్లి హాయిగా విశ్రాంతి తీసుకుంటూ వుంది. పాలు, సీమరేగులు, గోడలు, ఫర్నిచర్, పులుసు, తరతరాలుగా నివసిస్తున్న మనుషులు వీటన్నిటినుంచీ వచ్చే తమాషావాసన ఇల్లంతా అల్లుకుంటూ వుంది. చివరకు కాలము, దాని పరిణామము, జరిగిపోయిన అనేకఘట్టాల తాలూకు వాసన కూడా స్పష్టంగా నాశికా రంధ్రాలను సోకుతూనే వుంది.

నేను బయటికి వెళ్ళి అంతా కలయజూశాను. గున్నసీమ రేగు చెట్లు పళ్ళబరువుకు దాదాపు నేలబారు దాకా వొంగినవి. నేలమీద పచ్చని తివాసీ పరిచినట్లున్న పచ్చికమీద కొన్ని పళ్ళు రాలి ఉన్నవి.

ఇంటిచుట్టూ చాలా పొడుగ్గా, ఆకాశాన్ని అంటుతున్నవా అన్నట్లుగా పెరిగిన బీచ్‌చెట్లు, నాలుగు వరసల్లో ప్రహరీగా ఉన్నవి. గాలి ఆ చెట్లగుండా వెళ్తూ ఒకానొక విషాద గీతికను ఆలపిస్తున్నట్లు శబ్దం చేస్తూవుంది.

తిరిగి ఇంట్లోకి వెళ్ళాను. జమీందారు అగ్నిగుండం దగ్గర కూర్చుని అరికాళ్ళను వెచ్చబెట్టుకుంటూ కర్షకుడు చెప్పే విశేషాలను వింటున్నాడు. పెళ్ళిళ్ళను గూర్చి, పుట్టుకలను గూర్చి, చావుల్ని గూర్చి - ధాన్యం ధరపడిపోవటం, గొడ్డుగోదల ధరల్ని గూర్చిన విశేషాలు కుప్పతిప్పలుగా చెప్పసాగాడు. కొత్తగా కొన్న ఆవు జూన్ నెలలో ఈనింది. ఎప్రికాట్ సీమరేగులపంట చాలా తగ్గింది. బహుశా ఆ రకం సీమరేగులు మరి కనిపించకుండానే పోవచ్చు! ఇలాటి లోకాభిరామాయణాన్ని ముసలాడు వినిపిస్తున్నాడు.

తరువాత మేము భోజనాలు చేశాం. రకరకాల వంటకాలూ తయారైనవి. భోజనాల సమయంలో కర్షకునికీ, జమీందారుకూ వున్న అవినాభావ సంబంధం, మిత్రత్వం స్పష్టంగా గ్రహించగలిగాను. అసలు మొదటినుంచీ కర్షకుడు జమీందారు కుటుంబంలోని వ్యక్తి వలెనే ఎంతో ఆప్యాయతను ప్రదర్శిస్తూ వున్నాడు!

బీచ్‌చెట్లు గాలి రాపిడికి దుఃఖంతో ఏడుస్తూన్నట్లే ఎడతెరిపి లేకుండా శబ్దం చేస్తున్నవి. షెడ్‌లో కట్టివేసిన కుక్కలు మూలిగి మూలిగి సన్నగా అరవసాగినవి. అగ్ని గుండంలోని నిప్పు అంత్యదశను జేరుతూ వుంది. దాసీది నిద్రకు ఉపక్రమించింది. జీన్ అన్నాడు: "మీరు ఏమీ అనుకోకుండా వుంటే నేను నిద్రపోతాను. రాత్రిళ్ళు చాలాసేపటి వరకు మేలుకొనే అలవాటు నాకు లేదు."

గౌరవసూచకంగా జమీందారు తన చేతిని అందిస్తూ, "పోయిరా భాయీ!" అన్నాడు ఎంతో సౌహార్ద్రంతో. ముసలివాడు వెళ్ళిపోయాడు. చాలాసేపటి నుంచి బిగపట్టుకున్న ఆశ్చర్యాన్ని బైటపెడుతూ "ఈ కర్షకుడు మీకొక నమ్మిన బంటు- అవునా?" అని అడిగాడు.

"మా ఇద్దరిమధ్యా నీవు వూహించినదానికన్న గొప్ప సంబంధమే వుంది. అదొక విషాదగాథ. ఒక గొప్ప నాటకం! సామాన్యమైనదే అయినా హృదయాన్ని మెలిపెట్టే కథ-"

నేను వింటూ కూర్చున్నాను. జమీందారు గట్టిగా వూపిరి పీల్చి కథ చెప్పటం మొదలుపెట్టాడు.

## 2

"మా నాయన యుద్ధంలో కలొనెల్‌గా వుండేవాడని నీకు తెలుసుగా! ఆయన దగ్గర ఈ ముసలివాడు- అప్పటికి పడుచువాడే- ఆర్డర్లీగా వుండేవాడు. మా నాయన రిటైరైనప్పుడు ఈ కర్షకుడు కూడా రిటైరయ్యాడు. ఇతన్ని విడిచేందుకు ఇష్టపడక, నాయనగారు ఇతన్ని తన సేవకుడుగా తీసుకున్నారు. అప్పటికి ఇతని వయస్సు

నలభైఏళ్ళ దాకా ఉంటుంది. నా వయస్సు ముప్పైదాకా వుంటుంది. మేము అప్పుడు వాలెరెనీలోని పురాతనపు ఇంట్లో ఉండేవాళ్ళం.

మా అమ్మగారి దగ్గర వున్న దాసీపిల్ల ఎంతో అందంగా వుండేది. నాజూగ్గా, సన్నగా, పొడుగ్గా, ఆనందాన్ని చిలికే కళ్ళతో ఆరోగ్యకరంగా వుండేది. ఈ రోజుల్లో అలాటి పిల్లలే కనిపించరు. సరిగా ఈడు రాక పూర్వమే ప్రియుణ్ని వెతుక్కోవటం ఈ రోజుల్లో ఒక ఆచారంగా తయారైంది. ఇక పారిస్ పట్టణమా అంతులేకుండా పెరిగిపోతోంది. రోజురోజుకూ జనసంఖ్య పెరిగిపోతోంది. పట్టణపు నాగరికత వాళ్ళను ఆహ్వానిస్తోంది. వెంటనే పరిపూర్ణ స్త్రీత్వం రాకముందే వాళ్ళు పారిస్ జేరుతారు. పూర్వం పెద్దింటి పడుచులకు సఖులుగా, దాసీలుగా ఉండేవాళ్ళు. దారినపొయ్యే దానయ్యలను ఆకర్షించ సాగుతారు. అటు డబ్బుకు డబ్బూ, ఇటు ప్రియుని కౌగిలిలో పొందే సౌఖ్యమూ లభ్యమౌతవి. ఈ విధంగా వారు మెట్టుమెట్టుగా నీచజీవితానికి దిగిపోతారు. వాళ్ళల్లో స్త్రీత్వమా సున్నా, అసహ్యకరమైన జీవచ్ఛవమల్లే తయారయేదాకా వాళ్ళ స్థితి వాళ్ళకే తెలియదు!

సరే– ఈ అమ్మాయి ఎంతో ఆకర్షణీయంగా వుండేది. ఎప్పుడన్నా చీకటి మూలల్లో తటస్థపడితే ఆమెను ముద్దుపెట్టుకునేవాణ్ణి– అంతే ముద్దుతోనే ఆగిపొయ్యాను. ఈ సత్యాన్ని నేను ప్రమాణం చేసి చెపుతాను. ముద్దుకు మించి ముందుకు సాగలేదు. ఆమె శీలవతిగానే బతికింది. అదీగాక అమ్మగారి ఇల్లంటే నాకు ఎంతో గౌరవం. ఆ గౌరవానికి భంగం వాటిల్లకుండా జాగ్రర్తపడేవాణ్ణి.

ఇంతకు ముందు నాతో మాట్లాడిన ఈ ముసలి కర్షకుడు నాయనగారి దగ్గర సేవకుడుగా ఉండేవాడని చెప్పాను కదా– ఇతను ఆ పిల్ల ప్రణయంలో తలకిందులుగా పడ్డాడు. అయితే ప్రణయం చాలా విచిత్రమైంది. మొదట్లో అతని జ్ఞాపకశక్తి దెబ్బతిన్నది. చేసే పని మీద అతని మనస్సు నిలిచేదే కాదు.

"చూడు జీన్! నీలో ఏదో గొప్ప మార్పు వచ్చి పడింది. నీకు ఒంట్లో సరిగా లేదా?" అని నాయనగారు చాలా సార్లు అడుగుతూండేవాడు.

"అబ్బే! ఏం లేదు. నేను బాగానే వున్నాను" అని ఇతను తప్పించుకునేవాడు.

జీన్ క్రమంగా చిక్కిపోసాగాడు. భోజనం వడ్డించేప్పుడు గ్లాసుల్నీ, ప్లేట్లనూ జారవిడిచి పగలగొట్టేవాడు. అతని ఆరోగ్యంలో ఏదో లోపం ఉండి ఉండాలని డాక్టర్ దగ్గరికి పంపించాము. పెద్ద జబ్బు ఉన్నట్లుగా డాక్టర్ చెప్పలేదు. అయినప్పటికీ విశ్వాసనీయుడైన యీ సేవకుడి విషయమై నాయనగారు చాలా ఆందోళన పడ్డారు. ఒక పెద్ద ఆసుపత్రిలో కొన్నాళ్ళపాటు వుంచటం మంచిదని ఆయన అభిప్రాయపడి, ఆ సంగతి జీన్‌తో చెప్పారు. అప్పటికి కాని జీన్ బైటపడలేదు.

"అయ్యా!" అన్నాడు జీన్ వినయంగా.

"ఊఁ ఏమిటి చెప్పు."

"నాకు కావాల్సింది ఆరోగ్యం కాదు."

"ఐతే మరేమిటోయ్?"

"పెళ్ళి!"

నాయనగారు ఆశ్చర్యంతో అతని ముఖంలోకి చూశాడు.

"ఏమిటి? ఏమన్నావ్?"

"పెళ్ళి!"

"పెళ్ళా? గాడిదా! అయితే నీవు కూడా ప్రణయంలో పడ్డావన్నమాట?"

"ఔనయ్య!" అని వూరుకున్నాడు జీన్.

నాయనగారు ఆపుకోలేని నవ్వుకు గదిగోడలు ప్రతిధ్వనించినయ్. అవతలిగదిలో వున్న అమ్మగారు ఏమైందో తెలియక, గబగబా పరుగున వచ్చింది.

నాయనగారు నవ్వీ నవ్వీ కళ్ళల్లో నీళ్ళతో జీన్‌గారు ప్రణయరోగైన సంగతి అమ్మకు చెప్పారు.

అమ్మకు నవ్వు రాలేదు. ఆమె ఈ విషయాన్ని సీరియస్‌గానే తీసుకుంది.

"సరే ఎవర్నిరా బాబూ నీవు ప్రేమించింది?" అని ఆమె అడిగింది.

అతను అనుమానించకుండానే వెంటనే జవాబు చెప్పాడు. "లూసీని ప్రేమించాను అమ్మగారూ!"

"సరే సాధ్యమైనంత త్వరలో పెళ్ళికి తగిన ఏర్పాట్లు చేయిద్దాం" అందామె.

లూసీని పిలిపించి అమ్మ అనేక ప్రశ్నలు వేసింది. జీన్ తనను ప్రేమిస్తున్నట్లు తనకు తెలుసుననీ, అనేకవిధాలుగా అతను ప్రాధేయపడ్డాడనీ, కాని అతనంటే తనకు ఇష్టంలేదనీ లూసీ జవాబు చెప్పింది.

రెండునెలలపాటు నాన్నా, అమ్మా విడవకుండా జీన్‌ను పెళ్ళాడమని లూసీని ఒప్పించేందుకు విశ్వప్రయత్నం చేశారు. తాను మరో పురుషుణ్ణి ప్రేమించ లేదని చెపుతూండటం వల్ల, జీన్‌ను నిరాకరించేందుకు నమ్మ దగ్గ కారణాన్ని ఆమె చెప్పలేకపోయింది. నాయనగారు పెద్దగా డబ్బు ఆశపెట్టటంతో ఆమె సమ్మతించింది. ఈ దంపతులకు ఈ ఇల్లూ ఈ చుట్టుపట్లవున్న చిన్న ఎస్టేటు నాయనగారు చూసుకునేందుకు ఏర్పాటుచేశారు. పెళ్ళయాక మూడేళ్ళు గడిచినాయి. లూసీ క్షయదగ్గుతో చనిపోయిందని తెలిసింది. మరో రెండు సంవత్సరాల్లో నాయనా, అమ్మ కూడా చనిపోయారు. ఆ తరువాత కాని నేను జీన్‌ను కలవలేకపోయాను.

చాలాకాలంగా ఈ ప్రదేశం వేటకు బాగా వుంటుందని వింటూండేవాణ్ణి. ఒకానొక ఆకురాలే కాలంలో నేనిక్కడికి వచ్చాను.

ఆ సాయంత్రం ఐదేళ్ళ తరువాత జీన్‌ను చూశాను. మొదట్లో నేను అతన్ని గుర్తుపట్టలేకపొయ్యాను. ఎంతో ఆరోగ్యకరంగా, బలిష్టంగా వుండే ఈ సైనికుడు కుంగి కృశించి పోయాడు. తలంతా ముగ్గుబుట్టల్లే వుంది. నలభై ఐదేళ్ళకే ముదివగ్గ ఐపోయినట్లున్నాడు! ఇంతకుముందు మనం భోజనం చేసిన టేబిల్ మీదనే ఆ సాయంత్రం మేమిద్దరమూ భోజనం చేశాము. ఆ సాయంత్రం బాగా మసురుపట్టి, ధారాపాతంగా వర్షం కురవసాగింది. షెడ్‌లో కట్టివేసిన కుక్క విడువకుండా మొరగసాగింది.

ముసలిదాసీది వెళ్ళిపోగానే జీన్ హఠాత్తుగా "అయ్యా!" అన్నాడు.

"ఆఁ. ఏమిటి భాయీ!" అన్నాను.

"ఒక విషయాన్ని మీకు చెపుదామనుకున్నాను."

"చెప్పు భాయీ!"

"నా భార్య లూసీ మీకు గుర్తుందనుకుంటాను."

"ఆఁ బాగా గుర్తుంది."

"ఆమె... మీకొక విషయాన్ని చెప్పమంది."

"ఏమిటది?"

"అది... విషయం కాదు... హృదయపూర్వకమైన సత్యం అనొచ్చు."

"సరే. దేన్ని గూర్చి?" అన్నాను ఆతృతగా.

"ఆ సంగతులన్నీ మీతో చెప్పకూడదనుకోండి. ఐనప్పటికీ చెప్పకుండా ఉండనూ లేను. ఏం లేదు. ఆమె క్షయతో మరణించలేదు. ఆమె దుఃఖంతో చనిపోయింది. పెళ్ళి కాగానే మేము ఇక్కడికి వచ్చాము. ఆరు నెలల్లో ఆమె ఎంత మారిపోయిందనీ! చిక్కి శల్యమైపోయింది. మీరప్పుడామెను చూసివుంటే గుర్తుపట్టేవాళ్ళు కాదు. పెళ్ళికాక ముందు వేరు– పెళ్ళయ్యాక చాలా విచిత్రంగా మారిపోయింది.

డాక్టర్‌కు చూపాను. ఆమె లివర్‌లో ఏదో లోపముందన్నాడు. ఆ వ్యాధికి ఏదో పెద్దపేరు చెప్పాడు. ఆ పేరు నాకు తెలియదు. ఆ తరువాత లెక్కలేనన్ని మందులు కొన్నాను. మందులు మూడొందల ఫ్రాంకులైనవంటే ఎన్నో మీరే వూహించండి. అయితే ఆమె ఏ మందూ తాగేది కాదు.

"ఇవేమీ లాభంలేదండీ– వీటివల్ల ప్రయోజనం లేదు" అంటూండేదామె.

"అయితే ఆమె ఏదో మానసిక బాధకు గురైందని గ్రహించాను. ఒకనాడు ఆమె ఏడుస్తూ కూర్చుంది. ఆమెను ఎలా ఊరడించాలో, ఏం చేయాలో నాకు అర్థం కాలేదు.

"ఆమె మనస్సును వేరొకవిధంగా మార్చేందుకు ప్రయత్నించాను. చెవుల కమ్మలు, రకరకాల తలనూనెలూ, పౌడర్లూ మొదలైనవాటిని కొన్నాను. ఆమె వాటన్నిటినీ తృణీకరించింది. ఏదో దిగులు ఆమెను ప్రతిరోజూ కాస్త కాస్తగా తినేయసాగింది. ఇక లాభంలేదు. ఆమె బతకదని తెలుసుకున్నాను.

"ఒకానొక నవంబర్ మాసపురాత్రి ఆమె పూజారిని పిలవమన్నది. ఆ పగలంతా ఆమె పక్కమీది నుంచి దిగలేదు. పూజారి వచ్చాక, ఆమె నన్ను కూడా గదిలోనే ఉండమన్నది.?

"జీన్!" అన్నదామె. "నేను ప్రమాణం చేసి చెపుతున్నాను. పెళ్ళికి ముందుకానీ, పెళ్ళయ్యాక కానీ నేను నీపట్ల అవిశ్వాసనీయంగా ప్రవర్తించలేదు. నా అంతరాత్మను తెలిసిన భగవంతుని ముఖం చూసి కానీ విషయాన్ని చెప్పగలను. నేను చావసిద్ధమైన ఈ స్థితికి వచ్చానంటే జమీందారుగారి ఇంటిమీద నాకుండే మమతే కారణం. అంతకన్న జమీందారుగారి అబ్బాయంటే మక్కువే కారణం.

"ఆయనమీద నాకుండే అభిమానం అలాంటిది. అందువల్ల హానిలేదు కదా! ఆయన్ను చూడలేకపోతున్నానే అనే దుఃఖమే నన్నీస్థితికి దిగలాగింది. ఆయన్ను చూసే ఆశలు మరిలేవని తెలుసుకున్నాక, జీవించటం కన్న చావటమే ఉచితమని నాకు తోచింది. ఆయన్ను చూడగలుగుతున్నట్లయితే నేను బతికి వుండేదాన్ని. ఆయన కనిపిస్తే చాలు అంతకన్న నేను కోరేదేమీ లేదు. నాలో జీవశక్తి ఇలా హరించుకుపోయేది కాదు. ఈ సంగతి నేను పోయాక ఒకనాడు ఆయనకు చెప్పు. ఆయనకు చెపుతానని ఈ పూజారి ముందు ప్రమాణం చెయ్యి జీన్! యీ కారణం వల్లనే నేను చనిపోయానని ఆయన తెలుసుకుంటే చాలు... ప్రమాణం చెయ్యి!"

"నేను ఆనాడు ప్రమాణం చేశాను. నా ప్రమాణాన్ని నిలబెట్టుకునేందుకు ఈనాడు ఇదంతా చెప్పాను."

ఆ తరువాత అతను మరి మాట్లాడలేక పోయాడు. అతని కళ్ళవెంట నీరు ప్రవహించసాగింది.

## 3

"ఈ కథ విన్నాక నా అంతరాత్మ ఎంత క్షోభించిందో నీవు ఊహించలేవు. ఈ కర్షకుని భార్య నాకు తెలియకుండానే నా కారణంగా చనిపోయింది."

"పాపం!... జీన్!" అన్నాను.

"అంతేబాబు! నేను ఏమీ చేయలేకపోయాను. ఇప్పుడు అంతా చేయి జారిపోయింది" అన్నాడు జీన్.

జీన్ చేతిని నా చేతుల్లోకి తీసుకున్నాను. నాలో మరి దాగలేని దుఃఖం పొంగి పొర్లింది. చిన్నపిల్ల వాడల్లే ఏడ్చాను.

"ఆమె సమాధి చూస్తారా?" అని అడిగాడు జీన్.

నోటమాట రాక, అంగీకారంగా తలూపాను. అతను లేచి లాంతరు వెలిగించి గొడుగొకటి నాకిచ్చి బయలుదేరాడు. లాంతరు వెలుగులో వానచినుకులు బాణాలల్లే నేలను వాలుతున్నట్లున్నవి.

అతను గేటు తెరిచాడు. నల్లని కఱ్ఱలతో ఏర్పరిచిన శిలువ గుర్తులు కనిపించినవి.

అతను హఠాత్తుగా అన్నాడు: "ఆ చలువరాతి వెనుకనే ఆమె సమాధి వుంది" లాంతరు వెలుగు చలువరాతి మీద పడేట్లు ఎత్తాడు. రాతిమీది రాతను చదవగలిగాను.

"లూసీ- హోర్టెన్సీ మేరినెట్.

జీన్ ఫ్రాంకాయిస్ లెబ్రుమెంట్- అనే కర్షకుని భార్య.

ఈమె భర్తకు ఎంతో విశ్వాసనీయంగా బతికింది. భగవంతుడు ఆమె ఆత్మకు శాంతిని ప్రసాదించునుగాక!"

ఆ తడిగడ్డిలో మేమిద్దరమూ మోకరించాము. లాంతరు మా ఇద్దరికీ మధ్య వుంది. ఆ వెలుగులో వాన చినుకులు పవిత్రమైన ఆ చలువరాతి మీదపడి జారటం స్పష్టంగా కనిపించింది. ఆమె అభాగ్య హృదయం, ఆ సమాధిలో నిద్రపోతూ వుంది. పాపం! అనుకున్నాను కన్నీళ్ళతో.

## 4

"ఆనాటి నుంచీ ప్రతి సంవత్సరమూ నేను ఇక్కడికి వస్తూంటాను. కారణమైతే నాకు తెలియదు. కాని ఈ జీన్ ఎదుట నేనొక క్షమించరాని గొప్ప నేరాన్ని చేసినంత బాధపడుతుంటాను. కాని ఈ విశాలహృదయుడు నన్ను ఎప్పుడూ క్షమిస్తున్నట్లే కనిపిస్తాడు!"